

డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని రంగశీల పంచాయతీ నందివలస గ్రామంలో రూ.3లక్షల వ్యయంతో డ్రైనేజీ కాల్వల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేపట్టామని జెడ్పిటిసి రేగం మత్స్యలినం అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, డ్రైనేజ్ కాలువ లేక వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి జెడ్పీ నిధులు కేటాయించారన్నారు. స్థానిక సర్పంచ్ తాంగుల ముత్యాలమ్మ పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న జెడ్పిటిసి

జగనన్నకు చెబుదాం, స్పందన సమస్యలపై..

అధికారులు దృష్టి సారించాలి

-సచివాలయాల సిబ్బందితో సమావేశాలు నిర్వహించాలి-కలెక్టర్ సుమిత్ కుమార్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జగనన్నకు చెబుదాం, స్పందన ద్వారా వచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. స్పందన ఫిర్యాదులకు సక్రమంగా ఎండార్స్మెంటు వేయని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నామన్నారు. శుక్ర వారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో 135 ఫిర్యాదులు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ జె.శివశ్రీనివాసు, ఐటిడిఏ పి.ఓ.వి.అభిషేక్, ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వేంకటేశ్వరరావు, డిఆర్.పి. అంబేద్కర్ వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ, స్పందన ఫిర్యాదులపై ప్రధాన కార్యదర్శి ప్రతీ వారం సమీక్షిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా అధికారులు ప్రతి నెలా రంపచోడవరం, చింతూరు డివిజన్లలో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరిం చాలన్నారు. గ్రామ సచివాలయం సిబ్బందితో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా ఇన్చార్జి మంత్రి నియోజక వర్గాల వారీగా అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు తీరుపై సమీక్షిస్తారని జిల్లా అధికారులు ఆ మేరకు సన్నద్ధం కావాలన్నారు.

135 అర్జీలు స్వీకరణ ......

స్పందనలో 135 ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. తాగునీటి సమస్యలు, విద్యుత్తు సదుపాయాలు, వ్యక్తి గత సమస్యలు, ఉపాధి అవకాశాలు, భూ సమస్యలు, కళాశాలలు, పాఠశాలలు ప్రవేశాలకు అర్జీలు సమర్పించారు.

హుకుంపేట మండలం కంగారుపుట్టు గ్రామానికి సిసి రోడ్లు, డ్రైనేజీలు మంజూరు. చేయాలని కొర్రా అప్పారావు అర్జీని సమర్పించారు.పాడేరు మండలం చింతలవీధి గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్థంభాన్ని తొలగించాలని కొమ్ము సురేష్ బాబు వినతిపత్రం అందజేసారు. చింతపల్లి మండలం అంజలి శనివారం పంచాయతీ పెదురు పల్లి గ్రామం నుండి తామరాపల్లి గ్రామం వరకు రోడ్డు నిర్మించాలని ఉబలగరువు గ్రామస్తుడు వంతాల లక్ష్మణరావు కోరారు. డుంబ్రిగుడ మండలం సర్రాయి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ప్రమాద కరంగా ఉందని కొత్త భవనం మంజూరు చేయాలని గ్రామస్తులు పి.భగవతి, ఎం.ముద్దుల క్రిష్ణ తదితరులు ఫిర్యాదు చేసారు. జి.కె. వీధి మండలం దేవరాపల్లి పంచాయతీ వేలుగురాతి బంద గ్రామస్తులు లకే బాబూరావు, లకే ప్రసాదు తీములబంద జంక్షన్ నుండి వేలుగురాతి బంద గ్రామం వరకు రోడ్డు నిర్మించాలని కోరారు. జి. మాడుగుల మండలం బొయితిలి పంచాయతీ మద్దిగరువు గ్రామస్తులు సి.హెచ్. చంటి, కె.లత తదితరులు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. పలువురు తమ సమస్యలన విన్నవించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిడి ఐ. కొండలరావు, ఇ.ఇ.డి. వి.ఆర్. రాజు, పంచాయతీ రాజ్ ఇ.ఇ. టి.కొండయ్య పడాల్, రహదారులు భవనాల శాఖ ఇ.ఇ బాల సుందరబాబు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇఇ. లీలా క్రిష్ణ, డిపిఓ కొండలరావు, డివిజినల్ పంచాయతీ అధికారి పి. ఎస్.కుమార్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్.నంద్, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్ కుమార్‌రావు, పాడేరు తహశీల్దార్ త్రినాధరావు నాయుడు, హుకుంపేట తహశీల్దార్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్, పిఒ

పిఒకు సిఐటియు వినతి

పాడేరు: పాడేరు ఏజెన్సీలో పని చేస్తున్న సామాజిక ఆరోగ్య కార్యకర్తలను(సిహెచ్‌డబ్ల్యులను) ఆశా వర్కర్లుగా మార్చాలని, వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ మేరకు శుక్రవారం స్పందన కార్యక్రమంలో ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారికి సిహెచ్ డబ్ల్యూలతో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం సిహెచ్ డబ్ల్యూ లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సిహెచ్ డబ్ల్యులను ఆశా వర్కర్లు గా మార్పు చేయాలని గత కొన్ని ఏళ్లుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన కరువైంద న్నారు. గత 15 సంవత్సరాల నుంచి గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు అతి తక్కువ వేతనం నాలుగు వేలు ఇస్తుందని ఆయన తెలిపారు. తక్షణం అధికారులు చొరవ తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి ఆశా వర్కర్లుగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఇచ్చే కొద్దిపాటి వేతనాలు నెల నెల రాలేదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుశీల్ బడింగ్

కేంద్రం దృష్టికి కొండరెడ్డిల సమస్యలు

కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ అండర్ కార్యదర్శి సుశీల్ బడింగ్

ప్రజాశక్తి - రంపచోడవరం

ఏజెన్సీలోని కొండరెడ్డి కులస్తులకు సంబంధించిన సమస్యలపై నివేదిక కేంద్ర ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుందని కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ అండర్ సెక్రెటరీ సుశీల్ బడింగ్ పేర్కొన్నారు. మండలంలోని చిలక మామిడి గ్రామంలో కమ్యూనిటీ హాల్ వద్ద కొండరెడ్డి పివిటిజి కులస్తులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫారెస్ట్ క్లియరెన్స్ మంజూరు చేసి రోడ్లు ఏర్పాటు చేయాలని, తమ గ్రామానికి ఆనుకొని ఉన్న కాలువపై వంతెన నిర్మించాలని, 300 ఎకరాలకు సాగునీరు అదేవిధంగా వ్యవసాయ బోరులు, కరెంటు మోటర్లు ఏర్పాటు చేయాలని కోరారు. రంపచోడవరం నుండి తమ గ్రామానికి రహదారి పనులు పూర్తి చేసి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని, సబ్సిడీపై ట్రాక్టర్లు మంజూరు చేయాలని, మహిళలకు ఉపాధి కలిగించే విధంగా కుట్టు మిషన్లు ఇవ్వాలని, ప్రతి ఇంటికి పూర్తిస్థాయిలో తాగునీటి సౌకర్యం కల్పించాలని, గ్రామంలోని 8 వీధులకు సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో కొబ్బరి పీచు యూనిట్ ఏర్పాటు చేయాలని, 1/70 చట్టం, అటవీ హక్కుల చట్టం, పీసా చట్టం పక్కాగా అమలు చేయాలని, భూపతిపాలెం ప్రాజెక్ట్ ముంపు బాధితులకు రెండు ఎకరాల చొప్పున సాగు భూమి ఇవ్వాలని, జీవో నెంబర్ 3ను పునరుద్ధరించాలని, ప్రభుత్వం మంజూరు చేసే ఇళ్లకు నిధులు పెంచాలని, జీసీసీ ద్వారా జీడిపిక్కలు కొనుగోలు చేయాలని కోరారు.

అనంతరం సునీల్ బడింగ్ మాట్లాడుతూ భారతదేశంలో మొత్తం 75, ఆంధ్రలో 9 పివిటిజి తెగలు ఉన్నాయని, వెనకబడి ఉన్న ఈ తెగలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్రపతి ఆదేశాల మేరకు ఈ ప్రాంతానికి రావడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ట్రైకార్ జనరల్ మేనేజర్ మణికుమార్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలోని మన హక్కులను మనమే కాపాడుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ఏపీవో సిహెచ్.శ్రీనివాసరావు, తహశీల్దారు పివివి. జయసూర్య కుమార్, ఎంపీడీవో హరికృష్ణ, సర్పంచ్ పల్లాల ఆదిలక్ష్మి, డీఈలు ఎ.వెంకటేశ్వరరావు, రాజేంద్ర బాబు, ఏఈలు పి.వెంకటరమణ, శ్రీనివాస్, భీమశంకర్, రాజు, ఏపిఎం అప్పారావు, ఉపాధి హామీ ఏపీవో సాయిబాబా, వైటిసి మేనేజర్ సుధీష్, గ్రామ పెద్దలు పల్లాల లచ్చిరెడ్డి, ఒంటుకుల కృష్ణారెడ్డి, ఒంటికుల ఆదిరెడ్డి పాల్గొన్నారు

సమస్యలు పరిష్కరించాలి

-అంగన్‌వాడీల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు కే.కొండమ్మ, స్థానిక సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం అరకు సంతబయలులో పోస్టర్స్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా కొండమ్మ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడి వర్కర్లకు గ్రాడ్యుటి అమలు చేసి, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. మినీ అంగన్వాడి సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేసి, హెల్పర్లకు ప్రమోషన్లు కల్పించే వయస్సును 50 ఏళ్ళు పెంచాలని, సర్వీసులో ఉండి మృతి చెందితే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. 2017 నుండి పెండింగ్లో ఉన్న టిఏ బిల్లులు వెంటనే చెల్లించి, వేతనాలతో కూడిన మెడికల్ లీవ్‌లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జి.పవిత్ర, టి సత్యవతి, కే.మల్లమ్మ, జీ.రుక్మిణి, రామలక్ష్మి, టి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అంగన్వాడీ యూనియన్ నేతలు

4,235 ధ్రువపత్రాల పంపిణీ

ప్రజాశక్తి-పాడేరు:

జగనన్న సురక్ష కార్యక్రమం లో భాగంగా 4,235 దృవపత్రాలు పంపిణీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం 13 మండలాల పరిధిలోని 18 సచివాలయాల్లో జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. 19,529 గృహల నుంచి వాలంటీర్ల యాప్‌లో వివిధ సర్టిఫికెట్ల కోసం 17,064 వినతులు రాగా, 15,941 టోకెన్లు నమోదు చేయడం జరిగిందన్నారు. 11,721 దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడం జరిగిందని, అందులో 7,418 సర్టిఫికెట్లు ఆమోదించగా, 68 దరఖాస్తులు తిరష్కరణకు గురి కాగా 4,235 దృవపత్రాలు అదే రోజు పంపిణీ చేశామని తెలిపారు. మిగిలిన 7,418 దృవపత్రాలు సంబంధిత వాలంటీర్ల ద్వారా లబ్దిదారులకు ఇంటివద్దే నేరుగా పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. జగనన్న సురక్ష శిబిరాలలో మూడు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి అక్కడికక్కడే దరఖాస్తులు తీసుకొని ఆన్లైన్ చేసి దృవపత్రాలు జారీకి ఆదేశించడం జరిగిందన్నారు. నెట్ సౌకర్యం ఉన్న శిభిరాలలో రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్, మూడు కౌంటర్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.ఆదార్ లింకింగ్ సౌకర్యం కూడా ఏర్పాటు చేసినందున ఆదార్ సేవలు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆన్లైన్‌లో నమోదై ఆమోదించబడిన దృవపత్రాలను రానున్న రెండు రోజుల్లో పంపిణి చేయడం జరుగుతుందన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - రంపచోడవరం : రంపచోడవరం ఏజెన్సీలో సిపిఐ బలోపేతానికి ప్రతి కార్యకర్తా కృషి చేయాలని సిపిఐ అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి పోట్టిక సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు రంపచోడవరంలోని ఓ ప్రైవేటు గృహంలో ఏడు మండలాల కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ సూచించిన అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలన్నారు. అనంతరం రంపచోడవరం డివిజన్ కార్యవర్గాన్ని ప్రకటించారు. రంపచోడవరం డివిజన్ కన్వీనర్‌గా పల్లాల భీమిరెడ్డి, కో కన్వీనర్‌గా కర్రి వెంకటరావు, సభ్యులుగా తమడాల కృష్ణారెడ్డి, మిర్తివాడ చిన్నారెడ్డి, అన్నిక రాము, కుంజం లక్ష్మి, పల్లా చిన్నారెడ్డిని నియమించారు.



అభినందిస్తున్న యుటిఎఫ్ కమిటీ సభ్యులు

హెచ్‌ఎంకు యుటిఎఫ్ అభినందనలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతన ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టిన వి కృష్ణారావుకు స్థానిక యుటిఎఫ్ మండల కమిటీ సభ్యులు శుక్రవారం పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తిలో అంకిత భావంతో పనిచేస్తూ ఈ స్థాయికి రావడం గర్వకారణమని చెప్పారు. పాఠశాల సిబ్బందితో సమన్వయం చేసుకొని, విద్యాభివృద్ధికి నూతన ప్రధాన ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఎస్ బాలకృష్ణ, జిల్లా కౌన్సిలర్లు ఎస్.కన్నయ్య, ఏం.సత్యనారాయణ, టి.సుబ్బారావు, ఏం.మోహన్‌రావు, మండల నాయకులు ఎల్‌బి దుక్కు పాల్గొన్నారు.



సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఫాల్గుణ

సమస్యలపై ఎమ్మెల్యేకు మొర

ప్రజాశక్తి - పెదబయలు:సీతగుంట పంచాయతీ రోగులపేట గ్రామంలో గడప గడపలో భాగంగా అరకు ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణ శుక్రవారం పర్యటించారు. జోరు వర్షంలో తడుస్తూనే గడప గడపకు వెళ్లారు. గ్రామంలో సిసి రోడ్డు, డ్రైనేజి, మంచినీరు వంటి సమస్యలు పరిష్కారం చేయాలని మహిళలు కోరారు. పంచాయతీకు 40 లక్షలు మంజూరు చేశామని సంబంధిత ఇంజిరింగ్ అధికారులు ఎస్టిమేట్ వేసి ఎక్కడ ఏ ఏ సమస్యలున్నాయో ఈనెల 11 న లిఖితంగా తెలియజేయాలన్నారు గ్రామవాలంటీర్ల ద్వారా సమస్యలు తెలియజేయాలన్నారు.సిపిఎం మండల మహిళా అధ్యక్షురాలు టి.కౌసల్య మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధికి పంచాయతీ నిధులు రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించడంతో ప్రజలు పనులు కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కూడా బొంజుబాబు, సర్పంచి మాధవరావు, వైస్ సర్పంచ్ బోండా గంగాదరం, వైసిపీ నాయకులు గంపరాయి సూరయ్య, మాజీ జడ్పీటీసీ జర్సింగి గంగా భవాని, సర్పంచుల ఫోరమ్ మాజీ అధ్యక్షులు పాంగి సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

హంతకుని సభకు అనుమతులు ఎలా ఇస్తారు?

- ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు కనీసం పట్టించుకోని అనంతబాబు
- 2022 గోదావరి వరదల్లో మునిగిన అన్ని గ్రామాలనూ మొదటి కాంటూరులో చేర్చే దమ్ముందా?
- సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

ప్రజాశక్తి-కూనవరం

దళితుడైన తన మాజీ డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య చేసి, డోర్ డెలివరీ చేసిన కేసులో జైలు నుండి షరతులతో కూడిన బెయిల్‌పై వచ్చిన అనంతబాబు బహిరంగ సభకు పోలీసులు అనుమతులు ఎలా ఇస్తారని సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్ ప్రశ్నించారు. కూనవరంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేకల నాగేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో కిరణ్ మాట్లాడారు. గతేడాది గోదావరి వరదల సందర్భంగా ప్రజలు ఎన్నడూ చూడలేని బీభత్సాన్ని చూశారని, అనేక కష్టాలు అనుభవించారని, అయినా ఆ నాడు అధికార పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు ప్రజలను పట్టించుకోకుండా తిరిగారని తెలిపారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు కనీసం పరామర్శించని అనంతబాబు నేడు సొంత ఇమేజ్ పెంచుకునేందుకు ఈ నెల 9న కూనవరంలో సభ పెడుతున్నారని ఎద్దేవా చేశారు. ఏ ప్రజా సమస్య పరిష్కారానికి ఈ సభ పెడుతున్నాడో అనంతబాబు చెప్పాలని ప్రశ్నించారు. 2022 గోదావరి వరదల సందర్భంగా మునిగిన అన్ని గ్రామాలను మొదటి కాంటూరు చేర్చి నిర్వాసితులకు 2024 ఎన్నికల లోపు పరిహారం అందిస్తానని సభలో హామీ ఇవ్వగలడా? ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ గురించి జగన్‌ను ప్రశ్నించే దమ్ముందా? అని ప్రశ్నించారు. వైసీపీ నాయకులు అనంతబాబుకు భజన చేయడం తప్ప, ప్రజా సమస్యల పరిష్కారానికి కషి చేయడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మర్లపాటి నాగేశ్వరరావు, సీసం సురేష్, ఐవి, పూనెం సత్యనారాయణ, పల్లపు వెంకట్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్



మాట్లాడుతున్న సంతోష్‌కుమార్

అనంతబాబు సభ వల్ల ఒరిగేదేమిటి? : ఎపిఎజిఎస్

విఆర్.పురం : కూనవరంలో ఎమ్మెల్సీ అనంతబాబు నిర్వహిస్తున్న బహిరంగ సభ వల్ల పోలవరం నిర్వాసితులకు గాని, ఈ ప్రాంత ప్రజానీకానికి గాని ఒరిగేది ఏమిలేదని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రంపచోడవరం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ ప్రశ్నించారు. ఎన్నికలు దగ్గరపడుతుండడంతో తన బినామీలను గెలిపించుకోవటానికే ఈ సభ అని ఎద్దేవా చేశారు. శుక్రవారం రేఖపల్లిలో ఈ.సిరిమల్లిరెడ్డి అధ్యక్షతన జరిగిన సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో సంతోష్ కుమార్ మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు రూ.10 లక్షలు పరిహారం ఇస్తామని ఎన్నికలకు ముందు జగన్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. గతేడాది వరదలు వచ్చి ప్రజలంతా బిక్కు బిక్కు మంటూ జీవనం సాగిస్తుంటే నాడు ఏ మూలన కూర్చున్నాడో చెప్పాలన్నారు. జిఓ 3ను రద్దు చేసినపుడు అనంతబాబు నోరు ముగబోయిందా? బోయవాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చి జగన్ ప్రభుత్వం ఆదివాసీల మనుగడకే పెద్ద అన్యాయం చేసినపుడు అనంతబాబు నోరు, చేతులు, కాళ్ళు పనిచేయలేదా? అని ప్రశ్నించారు. ఈ ప్రాంతం నుంచి గెలిచిన ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు ఏమి చేశారని మండిపడ్డారు. గెలిచి హత్యలు చేస్తూ, స్మగ్లింగులు చేస్తూ, అడవిని అమ్ముకుంటూ, కేసులైతే అధికారాన్ని ఉపయోగించి ఎలా బయటపడాలని చూస్తున్నారు తప్పా వారికి ప్రజాసమస్యలు పట్టడం లేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రజానీకం ఆలోచించాలని, అనంతబాబు సభను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా నాయకులు కారం నాగేష్, బాబు, బొర్రయ్య, పూనెం ప్రదీప్ కుమార్, ఇర్పా అజయ్, పులి బొజ్జి, కారం సుందరయ్య, రేగులపాడు సర్పంచ్ శంకర్, కారం ధర్మరాజు పాల్గొన్నారు.

బెయిల్‌పై వచ్చిన వ్యక్తికి సెక్యూరిటీ ఎలా కల్పిస్తారు? : మాజీ ఎమ్మెల్యే

రంపచోడవరం : తన మాజీ డ్రైవర్ హత్యకేసులో షరతులతో కూడిన బెయిల్‌పై వచ్చిన అనంతబాబుకు పోలీసులు సెక్యూరిటీ ఎలా కల్పిస్తారని మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి ప్రశ్నించారు. పోలీసులే హంతకులను, గుండాలను సంరక్షిస్తే సమాజానికి ఎలాంటి మెసేజ్ ఇస్తున్నట్టు అని అన్నారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ భారీ వర్షాలకు గ్రామాలన్నీ పూర్తిగా మునిగిపోతే ఎక్కడెక్కడో తల దాచుకొని తినడానికి తిండి, తాగడానికి నీరు లేక ప్రజలు అల్లాడిపోయినప్పుడు కనిపించని ఈ నాయకులు ఈనాడు బహిరంగ సభ పెట్టడం శోచనీయమన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కారం సురేష్ బాబు, కారం సింహాచలం, వై.నిరంజన్‌దేవి, ఈకా నరసన్న దొర, కురుసం సత్యనారాయణ దొర, వల్లాల వెంకన్న, కోసూరి శ్రీనివాసరావు, పళ్ళల అబ్బాయి రెడ్డి, యాట్ల సత్యనారాయణ రెడ్డి, కురుసం ఈశ్వర్ పాల్గొన్నారు.

మలేరియా, డెంగీ ప్రబలకుండా చర్యలు

ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే



సమావేశంలో పాల్గొన్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, అధికారులు

ప్రజాశక్తి - రంపచోడవరం

మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా ప్రతి గ్రామంలో దోమలు నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. శుక్రవారం రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని 11 మండలాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన వైద్యాధికారులు, ఎంపీడీవోలు, మలేరియా సబ్ యూనిట్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్, మరి కొంతమంది అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు డివిజన్లోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో మలేరియా డెంగు నివారణ కొరకు ప్రత్యేక దష్టి పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పిహెచ్‌సిల్లో గత నెల ఈనెల ఎన్ని రక్త పరీక్షలు చేసింది ఎంతమందికి మలేరియా డెంగు ఉన్నది పీహెచ్ఈ ల వారిగా ప్రాజెక్ట్ అధికారి ఆరా తీశారు. ఏజెన్సీలోని ప్రతి గిరిజన ఆశ్రమం పాఠశాలలో మలేరియా స్ప్రేలింగ్, దోమలు నివారణకు సంబంధించిన పొగ చేయించాలని సూచించారు. అవసరం ఉన్న ప్రతి ప్రభుత్వ ఆసుపత్రికి రక్త పరీక్షకు సంబంధించిన కిట్లు సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతిరోజు డెంగ్యూ మలేరియాకు సంబంధించిన రిపోర్టులు సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డిఎంఎల్‌హెచ్ఓ డాక్టర్ పుల్లయ్య, ఎంపీడీవోలు హరికృష్ణ. ఎం బాబన్న దొర, రత్నకుమారి, వైద్యాధికారులు నరేష్, డాక్టర్ రాధిక, మలేరియా ఏఎంవో నక్క వెంకటేశ్వరరావు, సబ్ యూనిట్ అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ లబ్ధి కల్పించండి



ధ్రువపత్రాలు ఇస్తున్న జెడ్‌పిటిసి వెంకటలక్ష్మి

ప్రజాశక్తి-జి.మాడుగుల:అర్హులందరికీ లబ్ధి చేకూరే విధంగా అధికారులు కృషి చేయాలని జెడ్పిటిసి సభ్యురాలు వెంకటలక్ష్మి కోరారు. శుక్రవారం జి.మాడుగుల మండలం వంజిరి-1, గెమ్మిలి సచివాలయాల పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పిటిసి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగనన్న సురక్ష పథకం కింద అవసరమైన ధృవపత్రాలు జారీ చేయాలని కోరారు. ప్రస్తుతం వాలంటీర్లే ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని అవసరమైన ధృవపత్రాల జారీకి చర్యలు తీసుకోవడం మంచి విషయ మన్నారు. ప్రజలకు అవసరమైన ధృవపత్రాలను సచివాలయాల్లో ఆన్లైన్ చేసి అందించడం చారిత్రాత్మక విషయమని ఆమె పేర్కొన్నారు. జగనన్న సురక్ష పథకంలో గుర్తించిన 11 రకాల సేవలను లబ్దిదారులకు ఉచితంగా అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు.

మండల ప్రత్యేకాధికారి డిపిఆర్ఓ పి. గోవింద రాజులు మాట్లాడుతూ, మండల పరిధిలోని వంజరి-1 సచివాలయం ద్వారా సుమారు 700 దరఖాస్తులు ఆన్లైన్ చేయగా 350 దవపత్రాలు పంపిణీ చేశామన్నారు. గెమ్మిలి సచివాలయం పరిధిలో 850 దరఖాస్తులు ఆన్లైన్ కాగా 320 ధృవపత్రాలు పంపిణీ చేశామన్నారు.ఈ నెల 11న పాలమామిడి, వంజరి-2 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమాలలో తహసిల్దార్ అప్పలస్వామి, ఎంపిడిఓ చంద్ర శేఖర్, వైస్ ఎంపిపి సత్యనారాయణ, సర్పంచ్లు కె.రజని, కొండబాబు, హనుమంతరావు, ఎంపిటిసి వి.మధు, సిడిపిఓ సువర్ణమ్మ, జేఎస్ఎస్ ఇంచార్జ్ లెంకల కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

స్వావలంబన కార్డులకు పేర్లు నమోదు

ప్రజాశక్తి-రావికమతం: ఒకే దేశం - ఒకే కార్డు అనే నినాదంతో దివ్యాంగులందరికీ దేశంలో ఒకే గుర్తింపు కార్డు ఉండాలన్న ఉద్దేశంతో ఈ స్వావలంబన కార్డులను ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీవో వెంకన్న బాబు అన్నారు. మండలంలో మేడివాడ జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఆ కార్యక్రమంలో 92 మంది దివ్యాంగ విద్యార్థులకు స్వావలంబన కార్డులకు నమోదు చేశారు. వీరి అందరికీ త్వరలో కార్డులను అందజేయడం జరుగుతుందని తెలిపారు. దివ్యాంగ పిల్లలకు ప్రభుత్వం నుండి అన్ని రకాల సేవలను పొందడానికి ఉపయోగపడుతుందని అన్నారు. 2022-23 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పాసైన 17 మంది దివ్యాంగ విద్యార్థులను, దివ్యాంగ విద్యార్థులకు సహాయకులుగా (స్కయబ్) పరీక్షలు రాసిన విద్యార్థులు శిష్టి హేమలత, శిష్టి కార్తీక్, ఎన్నంశెట్టి కీర్తన, వజ్రపు షణ్ముఖ్, మానస లను ఎంపీడీవో కె.వెంకన్నబాబు, మండల విద్యాశాఖ అధికారి ఎన్.బ్రహ్మజీ, మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.రామారావులు సన్మానించారు. 2022-23 విద్యా సంవత్సరంలో 17 మంది దివ్యాంగ విద్యార్థులు పాసై 100శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. దీనికి కృషి చేసిన మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, జగన్నాథ నాయుడులను అభినందిం చారు

డెంగీపై అవగాహన

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలో సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 'డెంగీ నివారణ మాసోత్సవాలను" పురస్కరించుకొని అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్లు శక్తి ప్రియ, ఎన్ వాసంతి తెలిపారు. హెల్త్ విజిటర్ సూర్య కుమారి ఆధ్వర్యంలో రాయవరం గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్లినిక్ కు హాజరైన దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు గర్భిణులకు డెంగీ, చికెన్ గున్యా, మలేరియాపై అవగాహన కల్పించారు.

స్మార్ట్ నానో టెక్నాలజీతో బహుళ ప్రయోజనాలు

గీతం అంతర్జాతీయ సదస్సులో ఆసక్తికరమైన చర్చ, ప్రసంగాలు



శాస్త్రవేత్తలను అభినందిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : స్మార్ట్‌నానో టెక్నాలజీతో రూపొందించిన సాంకేతిక ఉపకరణాలు వైద్య ఆరోగ్యరంగం నుంచి శక్తి వనరుల ఉత్పాదన, నిర్మాణ రంగంలో ఎన్నో ప్రయోజనాలను కలిగిస్తున్నాయని, భవిష్యత్తులో ఆయారంగాల స్వరూపస్వభావాలను పూర్తిగా మార్చేయనున్నాయనిగీతం వేదికగా జరుగుతున్న అంతర్జాతీయ సదస్సులో వివిధ దేశాల శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. శుక్రవారం గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, కెమెస్ట్రీ విభాగం, ఖతార్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహిస్తున్న స్మార్ట్ నానో టెక్నాలజీస్ అంతర్జాతీయ సదస్సులో ఆసక్తికర చర్చలు జరిగాయి. దక్షిణ కొరియా ఇన్హా విశ్వవిద్యాలయం క్రియేటివ్ రీసెర్చ్ సెంటర్ డైరక్టర్ ప్రొఫెసర్ జోవాన్ కిమ్ మాట్లాడుతూ చెట్ల నుంచి లభించే నానోసెల్యులోజ్‌తో తయారయ్యే వివిధ రకాల ఉత్పత్తుల ప్రయోజనాలను వివరించారు.ఒ మన్ దేశానికి చెందిన సుల్తాన్ ఖబూస్ విశ్వవిద్యాలయం సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఖలీఫా అల్‌జబరి మాట్లాడుతూ ఫెర్రోక్రోమ్ పరిశ్రమ నుంచి వెలువడే వ్యర్థాలను అమెరికా, నార్వే, స్వీడన్, చైనా దేశాలలో రహదారుల నిర్మాణానికి ఇతర కట్టడాలలో ఉపయోగించడం జరుగుతోందని,అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునేందుకు ఫెర్రోక్రోమ్ వ్యర్థాలను కాంక్రీట్‌తో కలిపి నానో ఉత్పత్తులుగా వాడుతున్నారన్నారు. ఖతార్ విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ జాన్ ఖబీబాన్ మాట్లాడుతూ త్రిడి ప్రింటింగ్ పరిజ్ఞానం ఉపయోగించి కృత్రిమంగా చర్మం తయారీ,. సెన్సార్‌లను అమర్చి కృత్రిమ చర్మం స్పందనలు సహితం గ్రహించేలా చూడవచ్చునన్నారు. ఎక్స్‌క్వింజ్ లైఫ్ సైన్సెస్ సంస్థ వ్యవస్థాపకుడు కులదీప్ రజిదా మాట్లాడుతూ అత్యవసర ఔషధాలు, టీకాలను, రక్తనిధిని నియమిత ఉష్ణోగ్రతల మధ్య ఉంచుతూ అవసరమైన ప్రాంతానికి రవాణాలో స్మార్ట్ ప్యాకేజింగ్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. సదస్సు కో కన్వీనర్ ప్రొఫెసర్ అనీమా దధిచి మాట్లాడుతూ సదస్సులో బయో మెటీరియల్స్, సోలార్ సెల్స్, సెమీ కండక్టర్ టెక్నాలజీ, హైడ్రోజన్ ప్రొడక్షన్, స్మార్ట్‌నానో సెన్సార్స్, టిస్యూ ఇంజనీరింగ్, త్రిడి , 4డి ప్రింటింగ్, హైటెక్ డివైజస్, ఇనార్గానిక్, సాఫ్ట్‌మెటీరియల్స్ తదితర అంశాలపై నిపుణుల ప్రసంగాలు ఆలోచనలు రేకెత్తించేవిగా ఉన్నాయి. ప్రొఫెసర్ వేణుగోపాల్ ప్రోగ్రాం కన్వీనర్‌గా వ్యవహరించారు. అంతర్జాతీయ సదస్సు శనివారంతో ముగియనుంది.

రోడ్డు, పాఠశాల సౌకర్యం కల్పించాలని రిలే దీక్షలు

ప్రజాశక్తి- కోటవురట్ల:గొట్టివాడ శివారు అణుకు గ్రామానికి రహదారి, పాఠశాల సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు సిపిఎం ఆధ్వర్యంలో అనుకు గ్రామానికి వెళ్లే దారిలో శుక్రవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ, గిరిజన గ్రామమైన అణుకు గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం, పాఠశాల లేక పోవడంతో 50 కుటుంబాల ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. శాసనసభ్యులు గొల్ల బాబురావు , జిల్లా కలెక్టర్ కార్యాలయం, మండల పరిషత్, తహసిల్దార్ కార్యాలయాల్లో అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోక పోవడంతో నిరాహార దీక్షలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు అప్పలరాజు మాట్లాడుతూ, గ్రామానికి సరైన రోడ్డు, పాఠశాల, మౌలిక వసతులు లేక అవస్థలు పడుతున్నారని ఎన్నిసార్లు అధికారులకు, నాయకులకు మొర పెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. అణుకు గ్రామానికి చెందిన విద్యార్థులు పాఠశాల నుంచి తిరిగి వస్తు దీక్షశిబిరం వద్ద బైఠాయించారు. పాఠశాల, రోడ్డు సౌకర్యం కల్పించాలని నినాదాలు చేశారు. అధికారులు, నాయకులు ఇప్పటికైనా స్పందించి స్పష్టమైన హామీ ఇచ్చి నిధులు మంజూరు చేసే వరకు నిరాహార దీక్షలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు డేవిడ్‌రాజు, గ్రామానికి చెందిన గిరిజన మహిళలు పాల్గొన్నారు.

జీవాల పెంపకందారుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - ఆరిలోవ : గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తాననిరాష్ట్ర గొర్రెల పెంపకందారుల అభివృద్ధి సహకార ఫెడరేషన్ చైర్మన్ జి.ప్రకాష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం వెటర్నరీ జెడి కార్యాలయంలో డాక్టర్ డి.రామకృష్ణ అధ్యక్షతన ఉమ్మడి విశాఖ జిల్లా గొర్రెలు, మేకల పెంపకందారుల సమావేశం నిర్వహించారు. ముందుగా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ జిల్లా అధ్యక్షులు గంటా శ్రీరామ్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు ఒమ్మి సన్యాసిరావు, ఉపాధ్యక్షులు సబ్బి శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవాల మేతకు అన్ని మండలాల్లో బంజరు భూములను కేటాయించాలని, జీవాల కాపలాదారులకు 50 ఏళ్ళకు ఫించను అందించాలని,వారికి ప్రమాదబీమా వర్తింపజేయాలని కోరారు. దీనిపై స్పందించిన చైర్మన్ జి.ప్రకాష్ మాట్లాడుతూ గొర్రెల పెంపకందారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.. కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల చైర్మన్లు ఎంవి.కృష్ణారావు, డివివి.సత్యనారాయణమూర్తి, పశుసంవర్ధక శాఖ డిడి, ఎడి, వైద్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర చైర్మన్ ప్రకాష్ యాదవ్

స్వయం సహాయక సంఘాలకు లింకేజీ రుణాలు



చెక్కు పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు:మహిళా సంఘాలు బ్యాంకు లింకేజీని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో అనంతగిరి మండలాలనికి చెందిన 25 స్వయం సహాయ సంఘాలకు రూ. 1కోటి 47 లక్షల 50 వేల చెక్కును పంపిణీ చేసారు. మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతూ, బ్యాంకు లింకేజితో ఏమి చేస్తారని అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు లింకేజీని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, ఐటిడిఏ పి.ఓ.వి.అభిషేక్, డిఆర్ఓ పి.అంబేద్కర్, ఎస్‌డిసి, వి.వి.ఎస్. శర్మ, డిఆర్.డి.ఏ పి.డి. వి.మురళి, ఎల్.డి.ఎం. రవి తేజ, ఎపిఎంలు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కంటి కేన్సర్ పిల్లల ఆరోగ్య సంరక్షణకు ఎల్‌వి ప్రసాద్ ఆసుపత్రితో ఐఒసి ఒప్పందం



ఒప్పంద పత్రాలను ప్రదర్శిస్తున్న ఎల్‌విపిఇఐ, ఐఒసి ప్రతినిధులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కంటి కేన్సర్ బారిన పిల్లల సంరక్షణకు ఎల్‌వి.ప్రసాద్ వైద్య విజ్ఞాన సంస్థతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. శుక్రవారం ఎల్.వి.ప్రసాద్ వైద్య విజ్ఞాన సంస్థ 17వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఐఒసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.అనిల్‌కుమార్, ఎల్‌వి ప్రసాద్ నేత్రవైద్య విజ్ఞాన సంస్థ ఎగ్జిక్యూటివ్ అధ్యక్షులు డాక్టర్ ప్రశాంత్ గర్గ్ ఒప్పందపత్రాలపై సంతకాలు చేసారు. సాధారణ ప్రజలకు కంటి కేన్సర్‌పై అవగాహన పెంచడం, కంటి కేన్సర్ ఉన్న పిల్లలకు వైద్యం, శస్త్రచికిత్సలు అందించడం, వారు త్వరితంగా స్వస్థత పొందడంలో సహాయ పడే పోషకాహార సప్లిమెంట్లను సరఫరా చేయడం వంటి మూడు కీలక అంశాలను ఈ ఒప్పందంలో పొందుపరిచారు. ఈ సందర్భంగా కంటి కేన్సర్ పిల్లల ఆరోగ్య, ప్రాణ సంరక్షణకు పరస్పరం అవగాహన ఒప్పందం కుదరి భాగస్వాములు కావడంపై ఐఒసి ఇడి అనిల్‌కుమార్, ఎల్‌విప్రసాద్ కంటి ఆసుపత్రి సేవల అధిపతి డాక్టర్ స్వాతి హర్షం వ్యక్తంచేశారు.

న్యాయమూర్తుల బదిలీలు

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : విశాఖపట్నం మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జిగా ఇక్కడే రెండో అదనపు జిల్లా న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న ఎస్ శ్రీదేవిని నియమించారు. ఇక్కడ న్యాయమూర్తిగా విధులు నిర్వహించిన తిరుమలరావు ఉద్యోగ విరమణతో ఖాళీగా ఉన్న ఆ స్థానంలో శ్రీదేవిని నియమించారు. ఇక్కడ ఖాళీ అవుతున్న రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తిగా కర్నూల్‌లోని ప్రత్యేక సిబిఐ కోర్టు న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న ఎం.వెంకటరమణను నియమించారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

అంగన్‌వాడీల ధర్నాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-చింతూరు : ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలని, ముఖ్యమంత్రి హామీ మేరకు అంగన్వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు ఇవ్వాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 10, 11 తేదీల్లో చింతూరు ఐటీడీఏ ముందు 36 గంటల ధర్నాలను జయప్రదం చేయాలని సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ పిలుపునిచ్చారు. యూనియన్ చింతూరు మండల కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసిడిఎస్ పరిరక్షణ కోసం, అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, పిఎఫ్, గ్రాట్యూటీ, ఇతర పెండింగ్ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి పోడియం లక్ష్మణ్, గిరిజన సంఘం నాయకులు సీసం సురేష్ అంగన్వాడీ వర్కర్స్ సవలం వెంకటరమణ, జయ, కనకదుర్గ, దుర్గ, సావిత్రి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

పాకలోనే గుమ్మళ్లపాలెం పాఠశాల నిర్వహణ

ప్రజాశక్తి-కొయ్యూరు : కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని, నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు మారిపోయాయని ప్రభుత్వం చేస్తున్న ఊదరగొట్టే ప్రచారం వట్టి నీటిమూటలేనని మండలంలోని బంగారమ్మపేట శివారు గుమ్మళ్లపాలెం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలను చూస్తూ తెలుస్తుంది. ఈ పాఠశాలకు కనీసం భవనం లేని దుస్థితి నెలకొంది. గ్రామస్తులు నిర్మించిన పాకలోనే గత ఎనిమిదేళ్లుగా పాఠశాలను నిర్వహిస్తున్నారు. విద్యార్థులు కూర్చునేందుకు బెంచీలు లేవు. కనీస వసతుల ఊసే లేదు. వర్షానికి పాక కారిపోతుంది. దీంతో వర్షమొస్తే విద్యార్థులకు సెలవులు ఇస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి ఈ పాఠశాలకు భవనం నిర్మించాలని, కనీస వసతులు కల్పించాలని స్థానిక గిరిజనులు కోరుతున్నారు.



మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

స్విచ్‌యార్డులో మరమ్మతు పనులు పూర్తి

ప్రజాశక్తి - సీలేరు : సీలేరు జల విద్యుత్ కేంద్రం సమీపంలో ఉన్న స్విచ్ యార్డ్‌లో అత్యవసర మరమ్మతు పనులు పూర్తి చేసి విద్యుత్ సరఫరాను శుక్రవారం సాయంత్రం 3 గంటలకు పునరుద్ధరించామని ఏపీ జెన్కో ఎంఆర్‌టిపి డిఇ ఈ శ్రీకాంత్ వెల్లడించారు. మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు సీలేరు పంచాయతీ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేసామని పేర్కొన్నారు. మెయింటెనెన్స్ పనుల్లో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ పిల్లింగ్ తదితర సాంకేతిక లోపాలు సవరించడం వంటి పనులు నిర్వహించడం జరిగిందని వెల్లడించారు.

'ఉక్కు'ను రక్షించుకుంటాం

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపకుంటే బిజెపిని బంగాళాఖాతంలో కలిపేస్తాం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పలువురు వక్తల హెచ్చరిక
- విశాఖలో ఉక్కు రక్షణకు సిపిఎం ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శుల దీక్ష ప్రారంభం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ

'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' నినాదంతో 32 మంది ప్రాణత్యాగాలతో పోరాడి సాధించుకున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవడం కోసం ఏ త్యాగానికైనా సిపిఎం సిద్ధంగా ఉందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ప్రైవేటీకరణ చేస్తున్న బిజెపిని బంగాళాఖాతంలో రాష్ట్ర ప్రజానీకం కలిపేయడం ఖాయమని ఉద్ఘాటించారు. స్టీల్‌ప్లాంట్‌ను పోరాటాలతో కాపాడుకుంటామని పలువురు వక్తలూ స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం విశాఖ నగరంలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సిపిఎం ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శుల 24 గంటల దీక్ష శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైంది. దీక్షల్లో ఎం.జగ్గునాయుడు (విశాఖ), కె.లోకనాథం (అనకాపల్లి), పి.అప్పలనర్స (అల్లూరి సీతారామరాజు), టి.సూర్యనారాయణ (విజయనగరం), డి.వెంకటరమణ (మన్యం), డి.గోవిందరావు (శ్రీకాకుళం) కూర్చున్నారు. శనివారం ఉదయం 10 గంటల వరకూ జరిగే ఈ నిరాహార దీక్షను శ్రీనివాసరావు ప్రారంభిస్తూ మాట్లాడారు. సుదీర్ఘకాలంగా స్టీల్‌ప్లాంట్ కార్మికవర్గం పోరాడుతున్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోందన్నారు. దీనిలో భాగంగానే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను స్ట్రాటజిక్ సేల్ పేరుతో వంద శాతం అమ్మకానికి పెట్టిందని తెలిపారు. రాష్ట్రంలోని వైసిపి, తెలుగుదేశం, జనసేన పార్టీలు ఒక పక్క ప్రైవేటీకరణకు తాము వ్యతిరేకమని చెబుతూనే మరోపక్క బిజెపితో అంటకాగుతున్నాయని అన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా ఉద్యమం నిర్మిస్తామన్నారు.

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ ప్రైవేటీకరణకు ఆస్కారమిస్తే గంగవరం పోర్టులోని అనుభవమే విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోనూ ఎదురవుతుందని అన్నారు. స్థానిక కార్మికులను నెట్టేసే విధానం గంగవరం పోర్టు యాజమాన్యం తీసుకుందని తెలిపారు. ఉత్తరాంధ్రలో రాజకీయ పార్టీలు, ఎంఎల్‌ఎల వల్ల ప్రభుత్వ రంగ సంస్థలు ఎప్పుడూ నిలదొక్కుకోలేదని, ప్రజా, కార్మిక పోరాటాలతోనే నిలబడగలిగాయని పేర్కొంటూ షిప్‌యార్డు, బిహెచ్‌పివి, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ పోరాటాలను ఉటంకించారు. నాడు వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయాలని పావులు కదపగా కార్మికవర్గం తిప్పికొట్టిందన్నారు. బ్రాక్సైట్ వ్యతిరేక పోరాటం ఎలా సాగిందో వివరించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కావాలని జరిగిన పోరాటంలో ఇప్పుడున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తాత గుడివాడ అప్పన్న నిలబడగా, నేడు స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేందుకు కేంద్రం చూస్తుంటే అందుకు అనుగుణంగా మనవడు అమర్‌నాథ్ మధ్యవర్తిత్వం వహిస్తూ ముందుకెళ్తున్నాడని విమర్శించారు. ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ జార్జి విక్టర్ మాట్లాడుతూ పెట్టుబడిదారులు, కార్పొరేట్ల పోషణకారునిగా మోడీ ఉన్నారన్నారు. సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ ప్లాంట్ కోసం నేడు జరుగుతున్న పోరాటం.. ఉత్తరాంధ్ర ప్రజల భవిష్యత్తు కోసం చేస్తున్న పోరాటమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు దుందుడుకుగా ముందుకు వెళ్లడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌పై అసెంబ్లీలో తీర్మాణం చేశామని సరిపెట్టకుండా ఉత్తరాంధ్ర ప్రజల ప్రయోజనాలకు పెద్దపీట వేయాలన్నారు. ఉక్కు పరిరక్షణకు మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఇప్పటికే ప్రజలు విసిగి వేసారి ఉన్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను మోడీ ప్రభుత్వం అదానీ, అంబానీలకు కట్టబెట్టి తద్వారా లబ్ధి పొందాలని ప్రయత్నిస్తోందన్నారు.



దీక్ష చేస్తున్న వారితో కలిసి అభివాదం చేస్తున్న వి.శ్రీనివాసరావు

సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-విఆర్.పురం

స్థానిక ఆర్‌బికేలో వ్యవసాయ శాఖ సంయుక్తంగా గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీ పై వరి విత్తనాల సరఫరాను శుక్రవారం ప్రారంభించారు. యంపిపి కారం లక్ష్మి, రేఖపల్లి సర్పంచ్ సరోజిని, యంపిటిసి బంధం విజయలక్ష్మి చేతుల మీదుగా గిరిజన రైతులకు పంపిణీ చేశారు. 30 కేజీల బ్యాగ్ ధర రూ.1138 కాగా 90 శాతం సబ్సిడీతో రూ.120కు ఇవ్వటం జరుతుందని ఏఒ రఘుకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి సభ్యులు ముత్యాల శ్రీనివాస్, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిషన్ సభ్యులు విక్కాల బాలు, సిపిఎం మండల నాయకులు నల్లారాపు ప్రకాశరావు రైతులు తదితరుల పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న సిఐ బాజీలాల్

గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : గంజాయి అక్రమ రవాణా చేసినా, విక్రయించినా, వాటికి సహకరించినా వారు ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని రాజవొమ్మంగి సీఐ షేక్ బాజీలాల్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా పై మండలంలో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు చెప్పారు. రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్ఐలు టీజీ నరేంద్ర ప్రసాద్, షరీఫ్‌ల ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాండమ్ డైనమిక్ వాహన తనిఖీలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. గతంలో గంజాయి కేసుల్లో పట్టుబడ్డ వారు, తరచూ గంజాయి వ్యాపారం చేసేవారు, వారికి సహకరించే వారికి గంజాయి రవాణా తక్షణం మానుకోవాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పోలీస్ హెచ్చరికలు తిరస్కరిస్తే పీడియాక్టు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే మండలంలోని అనేక గ్రామాల్లో గంజాయి అక్రమ రవాణా, ఫేక్ లోన్ యాప్‌లు వలన కలిగే అనర్థాలు గూర్చి ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. వాహనదారుడు రికార్డులు, లైసెన్సు కలిగి ఉండడంతో బాటు ద్విచక్ర వాహనంపై ముగ్గురు వెళ్ళరాదని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. ఆటోలలో పరిణితిమించి ప్రయాణికులను ఎక్కించరాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాజవొమ్మంగి జడ్డంగి ఎస్ఐలు టీజీ నరేంద్ర ప్రసాద్, షరీఫ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల నాటివేత

ప్రజాశక్తి - సీలేరు : జికె.వీధి మండలం సీలేరు పోలీస్ స్టేషన్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి పచ్చని చెట్లు దోహదపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ గ్రామ పరిసరాల్లో ఏదో ఒక మొక్క నాటే విధంగా చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ 42 బెటాలియన్ ఇన్స్పెక్టర్ సుందరం, సివిల్, సిఆర్పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న తాబేళ్లు పట్టివేత

ప్రజాశక్తి - మోతుగూడెం : చింతూరు మండలం, మోతుగూడెం ఫారెస్ట్ సర్కిల్‌లో తులసిపాక ఫారెస్ట్ చెకపోస్ట్ వద్ద బుధవారం నాడు వాహన తనిఖీలు చేస్తుండగా ఆంధ్రప్రదేశ్ నుండి ఒడిశాకు అక్రమంగా రవాణా చేస్తున్న తాబేళును పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 172 తాబేళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిండుతుల్లో ఒకరు ఒడిశా రాష్టానికి చెందిన వారు, మరొకరు ఆంధ్రప్రదేశ్ కి చెందిన వారు. నిందుతులని రాజమండ్రి కోర్ట్ ముందు హాజరు పరచగా, 14 రోజులు జ్యూడిషల్ రిమాండ్‌కి తరలించారు. ఈ తనిఖీలలో ఎఫ్ఎస్ఒ లక్కవరం రేంజ్ పి. విజకుమార్, ఎఫ్‌బిఒ సరిత పాల్గొన్నారు.

ఆడాకులలో జగనన్న సురక్ష

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని ఆడాకుల గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న జెడ్‌పిటిసి వారా నూకరాజు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో గింజలకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో డౌనూరు ఎంపీటీసీ బిడిజన అప్పారావు, పొట్టిక పోతురాజు, గుమ్మడివాని పాలెం వార్డ్ మెంబర్ లేగుల ప్రసాద్ పాల్గొన్నారు.

టిడిపి నేత ఖాన్‌కు అస్వస్థత

ప్రజాశక్తి-కొయ్యూరు : టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎస్‌కెబి.ఖాన్ శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బ్రెయిన్ స్ట్రోక్ వల్ల తన ఇంటిలో ఒక్కసారిగా అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే రాజేంద్రపాలెం పీహెచ్సీకి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్ ఆసుపత్రికి వెళ్లి ఖాన్‌ను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.